నమస్తే తెలంగాణ
నిజామాబాద్
5 | నిజామాబాద్, శనివారం 9 నవంబర్ 2024 | NIZAMABAD

అభంగపట్నం కొనుగోలు కేంద్రం వద్ద కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతుకు సమస్యలు విన్నవిస్తున్న రైతు

బోనస్ ఇప్పించండి సార్!

కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతుకు రైతుల మొర

నవీపేట/ఎడపల్లి, నవంబర్ 8: ఆరు గాలం కష్టపడి పండించి ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో విక్రయించిన సన్న రకం వడ్లకు క్వింటాలుకు రూ. 500 బోనస్ ఇప్పించాలని రైతులు.. నిజామాబాద్ కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మాంతుకు మొరపెట్టుకున్నారు. శుక్రవారం కలెక్టర్ మండలంలోని అభంగపట్నం ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించారు. అక్కడికి చేరుకున్న రైతులు .. కలెక్టర్ దృష్టికి పలు సమస్యలను తీసుకెళ్లారు. మరణించిన రైతులకు చెందిన భూములను వారి వారసుల పేరుమీద పట్టా చేయాలని స్థానిక తహసీల్దార్ వెంకటరమణకు కలెక్టర్ సూచించారు. గన్నీ బస్తాలు, లారీల కొరత ఉందా అని నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా ధాన్యం కొనుగోళ్లు ఊపందుకున్నాయని తెలిపారు. ఇప్పటి వరకు 670 కేంద్రాల ద్వారా 65 వేల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించినట్లు చెప్పారు. సేకరించిన ధాన్యాన్ని వెంటనే సంబంధిత రైస్ మిల్లర్లకు పంపించాలన్నారు. క్షేత్ర స్థాయిలో గన్నీ బ్యాగులు, లారీల కొరత ఉంటే వెంటనే తన దృష్టికి తీసుకు రావాలని సూచించారు. ప్రతి రోజూ సగటున 15 వేల నుంచి 18 వేల టన్నుల ధాన్యాన్ని సేకరిస్తున్నట్లు చెప్పారు. ఎడపల్లి మండలం ఠాణాకలాన్, జాన్కంపేట్ గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను కలెక్టర్ రాజీవ్ గాంధీ హన్మంతు, అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్ వేర్వేరుగా పరిశీలించారు. ఠాణాకలాన్ సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాన్ని కలెక్టర్ పరిశీలించి రైతులతో మాట్లాడారు. కలెక్టర్ వెంట డీఆర్డీవో సాయాగౌడ్, డీసీవో శ్రీనివాస్‌రావు, జిల్లా ప్రాజెక్టు మేనేజర్ సాయిలు, తహసీల్దార్ వెంకటరమణ, ఎంపీడీవో నాగనాథ్, ఏపీఎం భూమేశ్వర్‌గౌడ్, ఏవో నవీన్‌గౌడ్, నవీపేట విండో చైర్మన్ న్యాలకంటి అబ్బన్న, రైతులు ఉన్నారు.

లింగంపల్లి కలాన్ గ్రామానికి వెళ్లే రోడ్డుపై కల్వర్టు వద్ద కుంగిపోయిన స్థలాన్ని పరిశీలిస్తున్న ఆర్డీవో ప్రభాకర్

'ధాన్యం కొనుగోళ్ల నిలిపివేత'పై ఆరా

- లింగంపల్లి కలాన్‌లో కల్వర్టుపై గుంతలను పరిశీలించిన ఆర్డీవో
- మట్టితో మరమ్మతులు చేపట్టిన గ్రామస్తులు

నాగిరెడ్డిపేట, నవంబర్ 8 : మండలంలోని లింగంపల్లి కలాన్ గ్రామానికి వెళ్లే రోడ్డులో కల్వర్టుపై ఏర్పడిన గుంతలను ఆర్డీవో ప్రభాకర్ శుక్రవారం పరిశీలించారు. కల్వర్టుపై గుంతలు ఏర్పడడంతో లారీ గ్రామానికి రాకపోవడంతో ధాన్యం కొనుగోళ్లు నిలిచిపోయాయి. ఈ విషయమై 'గ్రామానికి రాని లారీలు.. నిలిచిన కొనుగోళ్లు' శీర్షికన నమస్తే తెలంగాణ దినపత్రికలో ఈ నెల 8న కథనం ప్రచురితమైంది. దీనిపై కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్ స్పందించి, గ్రామాన్ని సందర్శించి నివేదిక అందించాలని ఆర్డీవో ప్రభాకర్‌కు సూచించారు. ఈ మేరకు ఆర్డీవో గ్రామానికి చేరుకొని కల్వర్టును పరిశీలించారు. గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ కుమారుడు రాజు, గ్రామస్తుల సహకారంతో రైతులతో కలిసి రాత్రి వేళ మట్టితో తాత్కాలిక మరమ్మతులు చేపట్టినట్లు గ్రామస్తులు తెలుపడంతో ఆర్డీవో సంతోషం వ్యక్తంచేశారు. వివరాలను నీటిపారుదల శాఖ ఏఈ అక్షయ్‌ని అడిగి తెలుసుకున్నారు. పనులు చేపట్టేందుకు రూ.9.9 లక్షలకు ప్రతిపాదనలు పంపినట్లు తెలిపారు. నిధులు మంజూరు కాగానే పనులు చేపడుతామని చెప్పారు. అనంతరం గ్రామంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆర్డీవో పరిశీలించి, తూకాన్ని తనిఖీ చేశారు.

పోక్సో కేసులో ఇద్దరు టీచర్లు

మాజీ ప్రజాప్రతినిధి అరెస్టు

భిక్కనూరు, నవంబర్ 8: భిక్కనూర్ మండలంలో నమోదైన పోక్సో కేసులో ముగ్గురు నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. అరెస్టయిన వారిలో ఇద్దరు ఉపాధ్యాయులు, ఓ మాజీ ప్రజాప్రతినిధి ఉన్నట్లు సమాచారం. వీరిని శుక్రవారం కామారెడ్డి జిల్లా కోర్టులో ప్రవేశపెట్టగా 14 రోజుల జ్యుడీషియల్ రిమాండ్ విధించింది. మండలంలోని ఓ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థినితో ఓ ఉపాధ్యాయుడు అసభ్యంగా ప్రవర్తించాడు. ఈ విషయం బయటికి తెలియకుండా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, ఓ మాజీ ప్రజా ప్రతినిధి రాజీ కుదుర్చగా.. విచారణ జరిపిన పోలీసులు నిందితులపై కేసు నమోదు చేశారు. ఈ కేసు విచారణ కామారెడ్డి డీఎస్పీకి బదులుగా ఎల్లారెడ్డి డీఎస్పీ పూర్తి చేయడం గమనార్హం.

అడవిమామిడిపల్లి వద్ద రాకపోకలు బంద్

- ఆర్వోబీ పనులు కొనసాగుతున్న నేపథ్యంలో..
- నెలరోజులపాటు దారి మళ్లింపు

వినాయక్‌నగర్/ మాక్లూర్/ఖిలీల్‌వాడి, నవంబర్ 8: నిజామాబాద్ జిల్లా పరిధిలోని మాక్లూర్ మండలం అడవిమామిడిపల్లి వద్ద ఆర్వోబీ (రైల్వే ఓవర్ బ్రిడ్జి) పనులు కొనసాగుతున్న నేపథ్యంలో ఈ నెల 10 నుంచి డిసెంబర్ 10వ తేదీ వరకు ఈ మార్గాన్ని మూసివేసినట్లు సహాయక కమిషనర్ ఆఫ్ పోలీసు నారాయణ (ట్రాఫిక్), ఆర్టీసీ రీజినల్ మేనేజర్ జానిరెడ్డి శుక్రవారం వేర్వేరు ప్రకటనల్లో తెలిపారు. నిజామాబాద్ నుంచి ఆర్మూర్, నిర్మల్, ఆదిలాబాద్, కరీంనగర్, వరంగల్ వెళ్లే మార్గంలో దారి మళ్లింపు చర్యలు చేపట్టినట్లు పేర్కొన్నారు.

దారి మళ్లింపు ఇలా!

భారీ వాహనాలు: నిజామాబాద్ నుంచి ఆర్మూర్ వైపు వెళ్లే భారీ వాహనాలు..డిచ్‌పల్లి హైవే (ఎన్‌హెచ్-44) పై నుంచి ఆర్మూర్ చేరుకోవాలి. ఆర్మూర్ నుంచి నిజామాబాద్ వచ్చే భారీ వాహనాలు డిచ్‌పల్లి హైవే(ఎన్‌హెచ్-44) నుంచి నిజామాబాద్ నగరానికి వెళ్లాల్సి ఉంటుంది.

ఆర్టీసీ బస్సులు : ఆర్మూర్ వెళ్లే బస్సులు చిన్నాపూర్, కల్లడి, ఆలూర్ గ్రామాల మీదుగా ఆర్మూర్ చేరుకోవాల్సి ఉంటుంది. అలాగే ఆర్మూర్ నుంచి నిజామాబాద్ వచ్చే ఆర్టీసీ బస్సులు ఇదే మార్గం నుంచి యథావిధిగా నిజామాబాద్ నగరానికి చేరుకోవాలి. ప్రయాణికులు దారి మళ్లింపును గమనించి, పోలీసులకు సహకరించాలని కోరారు.

భీమ్‌గల్‌లో సర్వే ప్రక్రియను పరిశీలిస్తున్న స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ అంకిత్

సర్వే గుబులు!

- కనీస స్పష్టత ఇవ్వని ప్రభుత్వ వర్గాలు
- ప్రజలను వెంటాడుతున్న అనుమానాలు
- సామాన్యుల నుంచి ఉద్యోగుల దాకా టెన్షన్
- రేషన్ కార్డు, సంక్షేమ పథకాలకు అనర్హులం అవుతామేమోనని భయం
- నేటి నుంచి సమగ్ర కుటుంబ సర్వే షురూ

గంగాధర్ పేద కుటుంబానికి చెందినవాడు. ఉపాధి నిమిత్తం గల్ఫ్‌కు వెళ్లి పదేండ్లు సహవాసం చేసి స్వదేశానికి వచ్చాడు. సంపాదించిన కాస్తో కూస్తో డబ్బుతో ఒక కారును కొనుగోలు చేసి కిరాయికి నడుపుకుంటున్నాడు. ప్రభుత్వ టాక్స్‌ల భారాన్ని మోయలేక టాక్సీ ప్లేట్ బదులుగా సొంత వాహనం కింద రిజిస్ట్రేషన్ చేయించుకున్నాడు. ఇటు కుటుంబ అవసరాలు, అటు సంపాదనకు ఇప్పుడు ఈ కారు ఆధారమైంది. సర్వేలో వాహనాల వివరాలు అడుగుతున్నారు. దీంతో గంగాధర్‌కు గుబులు పట్టుకుంది. కారు ఉందని చెబితే రేషన్ కార్డు పరిస్థితి ఏమిటి? అని ఆందోళన చెందుతున్నాడు. చెప్పకపోతే ఏమవుతుందో అని భయపడుతున్నాడు.

సురేశ్ ఓ వస్త్ర దుకాణంలో పని చేస్తూ బతుకుతున్నాడు. తనకు వచ్చే రూ.15వేలు జీతంతోనే కుటుంబాన్ని పోషిస్తున్నాడు. అతని ఏడాది ఆదాయం లెక్కిస్తే రూ.లక్షా 80 వేలు అవుతోంది. కానీ ఆదాయ సర్టిఫికేట్‌కు ఆధారం సంవత్సరానికి రూ.1.50లక్షలు పరిమితి ఉంది. సర్వేలో జీతం వివరాలు చెబితే రేషన్ కార్డుకు కోత పడుతుందా? అనే ఆందోళన వెంటాడుతుంది. అదే జరిగితే తనపై ఆధారపడి జీవిస్తున్న కుటుంబం పరిస్థితి ఏమిటి? అని జంకుతున్నాడు. రేషన్ కార్డు ఉంటుందా? ఊడుతుందా? భయంతోపాటు తనపై ఆధారపడిన తల్లిదండ్రులకు పింఛన్ నిలిచి పోతుందేమోనని ఆగమాగం అవుతున్నాడు.

నిజామాబాద్, నవంబర్ 8 (నమస్తే తెలంగాణ ప్రతినిధి)

ఇలా ఒకరు కాదు... ఇద్దరు కాదు... వందలు, వేలు, లక్షలాది మందిలో సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే భయాలకు గురి చేస్తోంది. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి నవంబర్ 7వ తేదీ నాటికి 11 నెలలు పూర్తి చేసుకున్నది. కుల గణన కోసం నిజామాబాద్ జిల్లాలో 3343 మంది ఎన్యుమరేటర్లు, 370 మంది సూపర్‌వైజర్లను నియమించారు. కామారెడ్డి జిల్లాలో ఎన్యుమరేటర్ల కోసం 2366 మంది, 237 మంది సూపర్‌వైజర్లను నియమించారు. జిల్లా మొత్తం 2లక్షల 90వేల 462 కుటుంబాలు ఉన్నట్లుగా అంచనా. ప్రతి ఎన్యుమరేటర్ గ్రామీణ ప్రాంతంలో 150 కుటుంబాలు, పట్టణ ప్రాంతాల్లో 125 కుటుంబాలు కేటాయించారు. ఎన్యుమరేటర్లు 8 పేజీలు కలిగిన 46 ప్రధాన ప్రశ్నలు, 19 ఉప ప్రశ్నలు కలిగిన మొత్తం 75 ప్రశ్నలు కలిగిన వివరాలు ఆయా కుటుంబాల నుంచి సేకరించనున్నారు. నవంబర్ 6వ తేదీ నుంచి 8వ తేదీ వరకు ఎన్యుమరేటర్లు ఇంటింటికీ తిరిగి స్టిక్కర్లు అతికించారు.
నేటి నుంచి సర్వే వివరాలను నమోదు చేయనున్నారు.

అనుమానాలు అనేకం...

బీఆర్ఎస్ సర్కారు ఉన్నప్పుడు సమగ్ర కుటుంబ సర్వేను ఒకే రోజు నిర్వహించిచి దేశ వ్యాప్తంగా అందరి దృష్టిని ఆకట్టుకున్నది. తద్వారా సాంకేతికంగా సమస్యలేవీ వెలుగు చూడలేదు. రోజుల తరబడి ప్రస్తుతం చేపట్టిన సర్వేతో ఎవరు ఎక్కడ ఉండాలో అర్థం కాని గందరగోళ పరిస్థితి ఏర్పడింది. ఉదాహరణకు ప్రైవేటు ఉద్యోగం చేసుకునే వ్యక్తి పట్టణాలకు వలస వచ్చి కిరాయి ఇంట్లో తల దాచుకుంటాడు. ఆ వ్యక్తి పల్లెను విడిచి పట్టణానికి వచ్చిన పాపానికి వివరాల నమోదులో ఎక్కడ సహకరించాలో అర్థం కాక తలలు పట్టుకుంటున్నారు. మరోవైపు ప్రైవేటు ఉద్యోగులకు సర్వే పేరుతో సెలవులు లేకపోవడంతో ఒక రోజు వేతనాన్ని త్యాగం చేయాల్సిన దుస్థితి కూడా ఏర్పడుతోంది. రేషన్, ఆధార్ కార్డులో వివరాలన్నీ పుట్టి, పెరిగిన గ్రామాల్లో నమోదై ఉండగా కాంగ్రెస్ సర్కారు చేపట్టిన సర్వే వివరాలను పట్టణాల్లో నమోదు చేస్తే ఏం అవుతుందో అన్న భయంతో ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. ఇంతటి గందరగోళంలో నేటి నుంచి మొదలు కానున్న ఇంటింటి సర్వేతో ప్రజలంతా ఇబ్బందులకు గురవుతున్నారు. ఈ వ్యవహారంపై జిల్లా స్థాయిలో కలెక్టర్లు కనీసం ప్రజలకు అవగాహన కల్పించలేదు. ప్రెస్‌మీట్లు నిర్వహించి పూర్తి స్థాయి సమాచారాన్ని ఇవ్వలేదు. ప్రజల్లో నాటుకుపోయిన అనుమానాల నివృత్తిని చేపట్టలేదు. కేవలం సర్వే పేరుతో ప్రభుత్వం ఒక ప్రకటన చేయగా.. దానిని అమలు చేయడానికే ప్రభుత్వ ఉన్నతాధికారులు, ప్రభుత్వ పెద్దలంతా సిద్ధం కావడం విమర్శలకు తావిస్తోంది.

రేషన్ కార్డు ఉంటదా...? పోతదా...?

సర్వేలో పొందుపరుస్తోన్న సమాచారాన్ని పరిశీలిస్తే వేలాది మందికి తెల్ల రేషన్ కార్డులు ఉండేనా? ఊడుతాయా? అనే అనుమానాలు ఉత్పన్నమవుతున్నాయి. ఆరోగ్య శ్రీ పథకానికి రేషన్ కార్డుతోనే ముడి పెట్టకుండా ఆరోగ్యశ్రీ కింద డిజిటల్ కార్డులు ఇస్తామని ప్రభుత్వం చెబుతోంది. ఈ నేపథ్యంలో కుటుంబ యజమాని స్థిర, చర ఆస్తుల వివరాలు ఇస్తే కార్డులు ఊడే ప్రమాదం లేకపోలేదన్న అనుమానాలను పలువురు వ్యక్తంచేస్తున్నారు. నిజానికి ఆస్తులు మాత్రమే కాదు. అప్పుల వివరాలు కూడా సేకరిస్తున్నట్లు నమ్మించడానికి ఫార్మట్‌లో ఒక అంశాన్ని రుణాలు ఏమైనా ఉన్నాయా? అని అడుగుతున్నారు. దాదాపు 90శాతం రుణాలు ప్రైవేటు వడ్డీ వ్యాపారులు వద్దే ఉంటాయి. అధికారికంగా చేసే రుణాలు కేవలం 10శాతం లోపే అన్నది అందరికీ తెలిసిందే. ఆస్తులు ఉన్నప్పటికీ విపరీతమైన అప్పులు ఉన్న వారి పరిస్థితి ఏమి కావాలి? అనే ఆందోళన ఇప్పుడు వ్యక్తమవుతున్నది., అప్పుల పేరు చెప్పి ఆస్తుల వివరాలు సేకరించడమే పనిగా ప్రభుత్వం పెట్టుకున్నటు అర్థం అవుతోంది. ఇండ్లు, ఇంటి విస్తీర్ణం, ఇంట్లో వాడుతున్న గదులు తదితర అంశాలను పరిగణలోకి తీసుకుని కరెంట్ బిల్లు మాఫీకి కూడా కోతలు పెట్టవచ్చని ప్రచారం జరుగుతోంది.

సమగ్ర కుటుంబ సర్వే చేయలేం

- చేతులెత్తేసిన మెప్మా సిబ్బంది
- చర్యలకు సిఫారసు చేసిన మున్సిపల్ కమిషనర్

కంఠేశ్వర్, నవంబర్ 8 : సమగ్ర కుటుంబ సర్వే తాము చేయలేమంటూ మెప్మాలో పనిచేస్తున్న 29 మంది సిబ్బంది చేతులెత్తేశారు. మెప్మా సిబ్బంది 200 మందిని సమగ్ర కుటుంబ సర్వే విధుల కోసం కేటాయించగా, ఇందులో 29 మంది సిబ్బంది తాము చేయలేమని, తమ వల్ల సర్వే కాదని స్పష్టం చేశారు. దీనిపై స్పందించిన నగరపాలక సంస్థ కమిషనర్ దిలీప్‌కుమార్ సర్వే చేయని సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని మెప్మా పీడీ రాజేందర్‌కు లేఖ రాశారు. మెప్మా విభాగంలో పని చేస్తున్న 29 మంది సిబ్బంది సర్వే చేయబోమని చెప్పిన మాట వాస్తవమేనని పీడీ రాజేందర్ తెలిపారు. సర్వే చేయని సిబ్బందిపై నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

ధాన్యం కొనుగోళ్ల లో
నిర్లక్ష్యం వహించొద్దు

పౌరసరఫరాల శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ డీఎస్ చౌహాన్

జంగంపల్లిలో కొనుగోలు కేంద్రంలో ధాన్యాన్ని పరిశీలిస్తున్న పౌరసరఫరాల శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ డీఎస్ చౌహాన్

భిక్కనూరు/ రామారెడ్డి, నవంబర్ 8 : ధాన్యం కొనుగోళ్లలో సిబ్బంది నిర్లక్ష్యం వహించొద్దని పౌరసరఫరాల శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ డీఎస్ చౌహాన్ సూచించారు. శుక్రవారం ఆయన భిక్కనూరు మండలంలోని జంగంపల్లి, సదాశివనగర్ మండల కేంద్రంలోని సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్‌తో కలిసి సందర్శించారు. వడ్ల కుప్పలతోపాటు తేమ శాతాన్ని పరిశీలించారు. రైతులు తమ పంటను ఆరబెట్టిన తర్వాతే కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చి తూకం వేయించుకోవాలని సూచించారు. ధాన్యం కొనుగోలు అనంతరం మూడు నుంచి ఆరు రోజుల్లో రైతుల ఖాతాల్లో డబ్బులు జమ చేస్తున్నారని తెలిపారు. అదనపు కలెక్టర్ విక్టర్, ఆర్డీవో రంగనాథ్ రావు, సివిల్ సప్లయ్ జిల్లా అధికారి రాజేందర్, డీఏవో తిరుమల ప్రసాద్, జిల్లా మార్కెటింగ్ అధికారిణి రమ్య, తహసీల్దార్లు తదితరులు ఉన్నారు.

అందరికీ అందుబాటులో న్యాయసేవలు

జిల్లా ప్రధాన న్యాయమూర్తి సునీత కుంచాల

వినాయక్‌నగర్, నవంబర్ 8: ఆదివాసులు, దళితులు, మహిళలు, ఆర్థికంగా వెనుకబడిన వారందరికీ న్యాయసేవలు అందుబాటులో ఉన్నాయని జిల్లా ప్రధాన న్యాయమూరి,జిల్లా న్యాయసేవ అధికార సంస్థ చైర్‌పర్సన్ సునీత కుంచాల అన్నారు. న్యాయసేవల దినోత్సవం సందర్భంగా శుక్రవారం జిల్లా కోర్టు ప్రాంగణం నుంచి న్యాయమూర్తులు, న్యాయవాదులు, విద్యార్థులు, పారా లీగల్ వలంటీర్ల ర్యాలీని ఆమె జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ.. ఆర్థిక అసమానతల కారణంగా ఎవరూ కూడా న్యాయసేవలకు దూరం కాకూడదనే లక్ష్యానికి అనుగుణంగా న్యాయసేవల చట్టం రూపొందించాలన్నారు. జిల్లా కోర్టు ప్రాంగణంలో జిల్లా న్యాయసేవ అధికార సంస్థ తన అధికారిక విధులను నిర్వహిస్తున్నదని తెలిపారు.

పోక్సో, క్రిమినల్ కేసుల్లో కేసుల తీవ్రతను బట్టి ఆర్థిక పరిహారం అందిస్తున్నామని వెల్లడించారు. విద్యా సంస్థల్లో లీగల్ లిటరసీ క్లబ్‌లను ఏర్పాటు చేసి, విద్యార్థులు చదవడానికి అనువుగా చట్టాలకు సంబంధించిన చిన్న, చిన్న పుస్తకాలు ,కరపత్రాలు అందుబాటులో ఉంచినట్లు పేర్కొన్నారు. ఆర్థికంగా వెనుకబడిన వారికి, మహిళలకు ఉచిత న్యాయసేవలు అందించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో న్యాయసేవా సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి పద్మావతి, సంస్థ సూపరింటెండెంట్ శైలజా రెడ్డి, చీఫ్ లీగల్ ఎయిడ్ కౌన్సిల్ రాజ్‌కుమార్ సుబేదార్,బార్ అసోసియేషన్ అధ్యక్షుడు జగన్మోహన్, న్యాయవాదులు ఆశ నారాయణ, రణదీశ్, గోపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జెండా ఊపి ర్యాలీని ప్రారంభిస్తున్న జిల్లా జడ్జి సునీత కుంచాల

ఏసీబీ వలలో వర్ని ఎస్సై

ఏసీబీ అధికారులకు పట్టుబడిన ఎస్సై

- స్టేషన్ బెయిల్ కోసం లంచం డిమాండ్
- రూ.20వేలు తీసుకుంటూ రెండ్‌హ్యాండెడ్‌గా పట్టుబడిన కృష్ణకుమార్

రుద్రూర్, నవంబర్ 8: వర్ని ఎస్సై కృష్ణకుమార్ ఏసీబీ వలకు చిక్కాడు. స్టేషన్ బెయిల్ కోసం ఓ వ్యక్తి వద్ద రూ. 20వేలు లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టబడడం పోలీసు శాఖలో కలకలం రేపింది. కోటయ్య క్యాంపునకు చెందిన నాగరాజుకు ఈ నెల 4న వర్ని వైన్స్ వద్ద శ్రీకాంత్ అనే వ్యక్తితో గొడవ జరగగా నాగరాజుతోపాటు మరో ఇద్దరిపై పోలీసులు కేసు నమోదు చేశారు. స్టేషన్ బెయిల్ కోసం ఎస్సై కృష్ణకుమార్ రూ. 50వేలు డిమాండ్ చేయగా.. రూ. 20వేలకు బేరం కుదిరింది. దీంతో నాగరాజు ఏసీబీని ఆశ్రయించాడు. నాగరాజు శుక్రవారం ఉదయం డబ్బులతో పోలీసుస్టేషన్‌కు వచ్చి ఎస్సై కృష్ణకుమార్ చేతిలో పెట్టగా.. ఏసీబీ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఎస్సైని విచారించి కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. హైదరాబాద్‌లోని నాంపల్లి కోర్టులో శనివారం హాజరుపర్చనున్నారు. డీఎస్పీ శేఖర్‌గౌడ్ ఆధ్వర్యంలో చేపట్టిన ఈ దాడిలో ఏసీబీ డీఎస్పీ శేఖర్‌గౌడ్‌తో పాటు ఇన్‌స్పెక్టర్లు వేణుకుమార్, నగేశ్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.